
సాక్షి విశాఖపట్నం

బుధవారం । 3 । మే । 2023



ఉద్యోగ విజయోత్సవం 10లో
జిల్లాలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో జాబ్ అచీవర్స్ డే ఘనంగా నిర్వహించారు. తల్లిదండ్రులను విద్యార్థులు సత్కరించారు.



ఇక స్క్రాప్ ఫ్రీ సిటీ!
విశాఖ నగరం త్వరలో స్క్రాప్ ఫ్రీ సిటీగా మారబోతోంది. ఇందుకు అవసరమైన ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. 8లో



ఆలోచనలే పెట్టుబడి
సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడిగా యువ తరం అంకుర సంస్థలను స్థాపించాలని, ఏయూ వీసీ ప్రసాద రెడ్డి అన్నారు. 8లో

న్యూస్‌రీల్

విశాఖ జిల్లాకు రెడ్‌క్రాస్ బంగారు పతకం

8న కలెక్టర్ స్వీకరణ



ఏయూక్యాంపస్: రెడ్‌క్రాస్ ద్వారా విశిష్ట సేవలందించిన విశాఖ జిల్లాకు గౌరవం దక్కింది. రాష్ట్ర స్థాయిలో టాప్ 5లో చోటు దక్కించుకుంది. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవంలో భాగంగా ఈ నెల 8న రాజ్‌భవన్‌లో జరిగే కార్యక్రమంలో గవర్నర్ నుంచి జిల్లా రెడ్‌క్రాస్ అధ్యక్షుడు, కలెక్టర్ మల్లికార్జున బంగారు పతకం అందుకోనున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ రక్త సేకరణ, ఆపదలో ఉన్న వారికి రక్తం అందించడం వంటి సేవలందిస్తుంది.

విద్యాశాఖ ఆర్జేడీగా లింగేశ్వర రెడ్డి

విశాఖ విద్య: విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్‌గా బి.లింగేశ్వర రెడ్డి నియమితులయ్యారు. ప్రస్తుతం ఆర్జేడీగా పనిచేస్తున్న జ్యోతికుమారి సెలవుపై వెళ్లటంతో ఆమె స్థానంలో విజయనగరం డీఈవో లింగేశ్వర రెడ్డికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. మన్యం పార్వతీపురం జిల్లా ఐటీడీఏ డిప్యూటీ డీఈవోగా పనిచేస్తున్న పి.బ్రహ్మాజీరావును అల్లూరి సీతారామరాజు జిల్లా డీఈవో కార్యాలయంలోని అసిస్టెంట్ డైరెక్టర్‌గా బదిలీ చేశారు. అదే విధంగా అనకాపల్లి జిల్లా యలమంచిలి డిప్యూటీ డీఈవోగా విధులు నిర్వహిస్తున్న ఎస్.ప్రేమ్‌కుమార్‌ను మన్యం పార్వతీపురం జిల్లా డిప్యూటీ డీఈవోగా బదిలీ చేసి, జిల్లా స్కూల్ ఎడ్యుకేషనల్ అధికారి(డీఎస్ఈవో)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రైవేటులో ఉచిత ప్రవేశాలకు మరో అవకాశం

విశాఖ విద్య: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలకు మరో అవకాశం కల్పించనట్లు డీఈవో ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుదారుల్లో అర్హులైన విద్యార్థులను లాటరీ ద్వారా ఈ నెల 22న ఎంపిక చేసి, జాబితా విడుదల చేస్తామన్నారు. ఆసక్తి గల వారు http://cre.ap.gov.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సమీపంలోని డిప్యూటీ డీఈవో, ఎంఈవోలను సంప్రదించాలన్నారు.

ఫుట్‌బాల్ జాతీయ జట్టు నేడు నేపాల్ పయనం

జట్టులో అక్కయ్యపాలెం క్రీడాకారుడు



కోచ్‌తో మణికంఠ

సీతంపేట: నేపాల్‌లో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఇండో నేపాల్ ఇంటర్నేషనల్ ఫుట్‌బాల్ చాంపియన్ పోటీల్లో పాల్గొనే జాతీయ జట్టు విశాఖ నుంచి బుధవారం పయనమవుతుంది. ఫిబ్రవరిలో జైపూర్‌లో జరిగిన అండర్–16 జాతీయస్థాయి పోటీలో ప్రతిభ చూపిన క్రీడాకారులను ఎంపిక జేసి.. కోచ్‌లు శ్రీనివాస్, మధుసూదన్, లతీఫ్ ఆధ్వర్యంలో విశాఖలోని రైల్వే స్టేడియంలో శిక్షణ ఇచ్చారు. 16 మందితో మంగళవారం జట్టును ఎంపిక చేశారు. ఈ జట్టుకు అక్కయ్యపాలెం రామకృష్ణానగర్‌కు చెందిన పాండవ మణికంఠ ఎంపికవ్వడం విశేషం. కప్ సాధించి తిరిగి రావాలని అతని తండ్రి పాండవ ఈశ్వరరావుతో పాటు స్థానికులు ఆకాంక్షించారు.

కొనసాగుతున్న చందనం అరగదీత



చందనం అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో రెండో విడత చందనం అరగదీత మూడవ రోజైన మంగళవారం కొనసాగింది. ఈ నెల 5న వైశాఖ పౌర్ణమి పురస్కరించుకుని స్వామికి సమర్పించే మూడు మణుగుల(120 కిలోల) పచ్చి చందనంను సమకూర్చేందుకు ఆదివారం అరగదీత ప్రారంభించిన విషయం తెలిసిందే. తొలిరోజు 43, రెండో రోజు 43, మూడో రోజు 30 కిలోల చందనాన్ని అరగదీశారు. మరో 4 కిలోల చందనం కావాల్సి ఉండగా.. బుధవారం అరగదీత కొనసాగనుంది.

ఉజ్వలాంధ్ర



భోగాపురం ఎయిర్‌పోర్టు నమూనా

- రూ.4,592 కోట్లతో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం
- రూ. 21,844 కోట్లతో అదానీ డేటా సెంటర్
- రూ.2వేల కోట్లతో తారకరామ తీర్థసాగర్, జెట్టీ నిర్మాణం
- సీఎం జగన్ చేతుల మీదుగా నేడు శంకుస్థాపన
- విమానాశ్రయం నుంచి విశాఖ వైపు మరింత అభివృద్ధి
- 139.16 ఎకరాల్లో రెసిడెన్షియల్ ఏరియా డెవలప్‌మెంట్

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

ఉత్తరాంధ్రవాసుల కలలు ఒక్కొక్కటిగా నిజమవుతున్నాయి. ఇటీవలే శ్రీకాకుళంలో మూలపేట పోర్టు పనులకు శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. బుధవారం మరిన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. రూ.4,592 కోట్లతో భోగాపురం వద్ద నిర్మించనున్న అంతర్జాతీయ విమానాశ్రయం, రూ.21,844 కోట్ల పెట్టుబడులతో మధురవాడ ఐటీ హిల్‌లో అదానీ డేటా సెంటర్, సుమారు రూ.2 వేల కోట్ల వ్యయంతో నిర్మించనున్న తారకరామ తీర్థసాగర్, జెట్టీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఒకవైపు అంతర్జాతీయ విమానాశ్రయం.. మరోవైపు అదానీ డేటా సెంటర్ ఏర్పాటుతో పాటు మత్స్యకారుల సంక్షేమం కోసం పోర్టు, జెట్టీ, రైతుల సంక్షేమం కోసం రిజర్వాయర్ నిర్మాణంతో ఉత్తరాంధ్ర.. ఉజ్వలాంధ్రగా మారనుందని అందరిలో సంతోషం వ్యక్తమవుతోంది.

రెండు వారాల వ్యవధిలోనే..

కొద్ది రోజుల కిందట శ్రీకాకుళం జిల్లాలో రూ.4,362 కోట్ల వ్యయంతో చేపడుతున్న మూలపేట పోర్టు పనులకు సీఎం శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. అలాగే రూ.176.35 కోట్లతో వంశధార లిఫ్టు పనులు, రూ.300 కోట్లతో మహేంద్రతనయ ఆఫ్‌షోర్ రిజర్వాయర్, రూ.365.81 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాలకు కూడా శంకుస్థాపన చేశారు. ఇప్పుడు మరిన్ని భారీ పెట్టుబడులకు పలు ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపనలు చేస్తుండటం విశేషం. ఈ పెట్టుబడుల ప్రవాహంతో స్థానికులకు భారీగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. రానున్న రోజుల్లో విశాఖపట్నం ఐటీ రంగానికి కేంద్ర బిందువుగా మారనుంది.

భోగాపురం ఎయిర్‌పోర్టు

విస్తీర్ణం	2,203 ఎకరాలు
నిర్మాణ వ్యయం	రూ.4,592
నిర్మాణ సంస్థ	జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు లిమిటెడ్
రన్‌వే పొడవు	3.8 కి.మీ
తొలి దశ	ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల రాకపోకలకు వీలు
ఉపాధి	ప్రత్యక్షంగా లక్ష మందికి, పరోక్షంగా 5 లక్షల మందికి..

విశాఖ వైపు అభివృద్ధికి బాటలు

భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయం అధునాతనంగా రూపుదిద్దుకోనుంది. ఒకేసారి 22 విమానాలను నిలిపి ఉంచేందుకు వీలుగా.. ఏటా 1.80 కోట్ల మంది ప్రయాణికులు విమానయానానికి అనుగుణంగా రూ.4,592 కోట్ల పెట్టుబడితో ఈ విమానాశ్రయాన్ని నిర్మించనున్నారు. ఇక్కడే ఏవియేషన్ అకాడమీ కూడా ఏర్పాటు కానుంది. భోగాపురం నుంచి విశాఖ వైపు అభివృద్ధి చేసేందుకు అనుగుణంగా 154.74 ఎకరాల్లో వివిధ అభివృద్ధి పనులను చేపట్టనున్నారు. 139.16 ఎకరాల్లో విశాఖ నగరం వైపునకు రెసిడెన్షియల్ డెవలప్‌మెంట్ చేపట్టాలని నిర్ణయించారు. తద్వారా భోగాపురం నుంచి విశాఖ నగరం వరకు నివాసిత ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నాయి. హైదరాబాద్–సికింద్రాబాద్ జంట నగరాల తరహాలో రానున్న రోజుల్లో విశాఖ–విజయనగరం కలిసి అభివృద్ధి చెందే అవకాశం ఉందనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వాసితులను ఒప్పించి.. కోర్టుల్లో ఉన్న కేసులన్నీ పరిష్కరించి జీఎంఆర్ సంస్థకు ఆ భూములను అప్పగించారు.

నాడు

2019 ఫిబ్రవరి 14న భోగాపురం విమానాశ్రయానికి నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు శిలాఫలకం ఆవిష్కరించారు. సార్వత్రిక ఎన్నికలకు సరిగ్గా రెండు నెలల ముందు తూతూమంత్రంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాటికి భూసేకరణ ప్రక్రియ కొలిక్కి రాలేదు. శిలాఫలకం వేసిన స్థలం సహా అంతా వివాదాస్పదమే.. వంద మందికి పైగా రైతులు వేసిన పిటిషన్లు కోర్టు విచారణలోనే ఉన్నాయి. నిర్వాసితులకు ఓ దారి చూపించలేదు. విమానాశ్రయం నిర్మాణానికి కేంద్ర మంత్రిత్వ శాఖల నుంచి అనుమతులేవీ రాలేదు. ఈ కార్యక్రమానికి విమానయాన శాఖ మంత్రిగా పని చేసిన అశోక్ గజపతిరాజు ముఖం చాటేశారు.

నేడు

సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే భోగాపురం విమానాశ్రయానికి కార్యరూపం తీసుకొచ్చేందుకు త్రిముఖ వ్యూహం అనుసరించారు. భూసేకరణ పూర్తి చేయించారు. రైతులకు తగిన నష్టపరిహారం, నిర్వాసితులకు పునరావాసం విషయంలో ఉదారతను చాటుతూ వారిని ఒప్పించారు. హైకోర్టు, సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్‌ట్రిబ్యునల్‌లో పిటిషన్లన్నీ పరిష్కారమయ్యేలా చొరవ చూపించారు. ప్రధాని మోదీ సహా కేంద్ర మంత్రులను తరచూ సంప్రదిస్తూ విమానాశ్రయానికి అవసరమైన అనుమతులన్నీ సాధించారు. ఇలా మార్గం సుగమమైన నేపథ్యంలో శంకుస్థాపనకు సర్వం సిద్ధమైంది.

సీఎం జగన్ పర్యటన ఇలా..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం 8.30 గంటలకు గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 9.20 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడ 9.30 గంటలకు బయలుదేరి 10 గంటలకు భోగాపురం మండలంలోని ఎ.రావివలస చేరుకుంటారు. 10.30 గంటలకు భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, చింతపల్లి ఫిష్ ల్యాండింగ్ సెంటర్, తారకరామతీర్థసాగర్ ప్రాజెక్ట్ పనులకు శంకుస్థాపన చేస్తారు. బహిరంగ సభ అనంతరం 12.30 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు. 2.30 గంటలకు మధురవాడ ఐటీ హిల్స్–4లో వైజాగ్ టెక్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. తరువాత ఎంపీ ఎంవీవీ ఇంటికి చేరుకొని నూతన దంపతులైన ఆయన కుమారుడు, కోడలిని ఆశీర్వదిస్తారు. 5.30 గంటలకు విశాఖ విమానాశ్రయం నుంచి బయలుదేరుతారు.

నాడు

తమ ప్రభుత్వ హయాంలోనే అదానీ డేటా సెంటర్ వచ్చిందంటూ టీడీపీ నేతలు వాస్తవాన్ని దాచిపెట్టి గొప్పలకుపోతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎక్కడా భూమి కూడా చూపించకుండానే 2019 జనవరి 9వ తేదీన కాపులుప్పాడ, నక్కపల్లి, జి.చోడవరం ప్రాంతాల్లో మూడు డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్టు టీడీపీ ప్రభుత్వం హడావుడిగా అవగాహన ఒప్పందం చేసుకుంది. ఎటువంటి నిర్దిష్టమైన చర్యలు తీసుకోకపోవడంతో ఎక్కడా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు.

నేడు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అదానీ డేట్ సెంటర్‌కు నిర్దిష్టంగా భూమిని కేటాయించడంతో పాటు ప్రభుత్వం నుంచి ఏయే సహాయ సహకారాలను అందిస్తున్న విషయాన్ని కూడా పేర్కొంటూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో మధురవాడలోని సర్వే నంబర్ 409లో 130 ఎకరాల్లో అదానీ డేట్ సెంటర్ ఏర్పాటవుతోంది. కాపులుప్పాడలో మరో డేటా సెంటర్ కోసం 60.29 ఎకరాలను కూడా కేటాయించింది. ఇందుకు అనుగుణంగా 2023 మార్చి 11న ఉత్తర్వులు జారీ చేసింది.

ఇదీ అదానీ డేటా సెంటర్

వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్ (వీటీపీఎల్) ఆధ్వర్యంలో రూ. 21,844 కోట్లతో 190.29 ఎకరాల్లో 300 మెగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్‌తో పాటు ఐటీ, బిజినెస్ పార్క్, స్కిల్ యూనివర్సిటీ, రిక్రియేషన్ సెంటర్ ఏర్పాటు కానున్నాయి. దీని ద్వారా ప్రత్యక్షంగా 39,815 మందికి ఉపాధి లభించనుంది. మొత్తం ఏడేళ్ల కాలంలో దీని నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్టు కంపెనీ ఒప్పందం చేసుకుంది.



పెట్టుబడులు ఇలా..

మొదటి దశలో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
200 ఎండబ్ల్యూ డేటా సెంటర్	10,288	4,040
ఐటీ, బిజినెస్ పార్క్	2,363	15,110
స్కిల్ సెంటర్	1,171	3,750
మొత్తం	14,634	24,990

రెండో దశ(కాపులుప్పాడ వద్ద)లో..

ప్రాజెక్ట్	పెట్టుబడి (కోట్లలో)	ఉపాధి
100 మెగావాట్ల డేటా సెంటర్	5,070	2,200
ఐటీ, బిజినెస్ పార్క్	1,165	15,350
స్కిల్ సెంటర్	400	1,025
రిక్రియేషన్ సెంటర్	575	1,875
మొత్తం	7,210	20,450

నాలుగు దశల్లో చేపట్టనున్న ఈ నిర్మాణాలను ఏడేళ్ల కాలంలో పూర్తి చేస్తానని కంపెనీ తెలిపింది.

సీఎం పర్యటనకు భారీ భద్రత

1300 మందితో పటిష్టమైన బందోబస్తు



సిబ్బందికి సూచనలు చేస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విశాఖ పర్యటన నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపడుతున్నారు. సుమారు 1300 మందిలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. మధురవాడ ఐటీ హిల్ నెంబర్–4లో వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్‌కు సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ నివాసానికి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ మంగళవారం సాయి ప్రియా రిసార్ట్స్‌లో బందోబస్తు విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

- సీఎం పర్యటన సందర్భంగా పోలీసు బందోబస్తును పలు కేటగిరిలుగా విభజించారు. పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టి, ఒక్కో విభాగానికి ఒక్కో పోలీసు ఉన్నతాధికారిని పర్యవేక్షణాధికారిగా నియమించారు.
- హెలీప్యాడ్, పార్కింగ్, కాన్వాయ్, ఐటీ హిల్స్, శిలా ఫలాకాల వద్ద, విశాఖ ఎంపీ నివాసం ప్రాంతంలోను, వీవీఐపీలకు బందోబస్తు విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ భద్రతా చర్యలపై దిశానిర్దేశం చేశారు.
- నగరంలో వాహనాల రాకపోకలకు ఎటువంటి విఘాతం ఏర్పడకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమించారు.
- హెలిపాడ్ వద్ద, వేదిక ప్రాంతంలో స్నిఫర్ డాగ్, బాంబు స్క్వాడ్లతో నిశితంగా తనిఖీలు చేపట్టారు.
- సీఎం పర్యటనలో పాల్గొనే ముఖ్య వ్యక్తుల వాహనాలకు, కార్యక్రమంలో పాల్గొనేందుకు విచ్చేసే ఇతరుల వాహనాలకు వేరు వేరుగా పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.
- నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ సీఎం పర్యటించే పర్యటించే ప్రాంతాలను సందర్శించి, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

విశాఖకు సమున్నత స్థానం

- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి విడదల రజిని
- ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లు పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవి సుబ్బారెడ్డి, మంత్రి రజిని, కలెక్టర్ మల్లికార్జున, ఎంపీ ఎంవీవీ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి

కొమ్మాది: విశాఖను దేశంలో సమున్నత స్థానంలో నిలపాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని అన్నారు. బుధవారం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మధురవాడ ఐటీ హిల్ నెంబర్–4లో వైజాగ్ టెక్ పార్క్ లిమిటెడ్‌కు శంకుస్థాపన చేయనున్న సందర్భంగా ఏర్పాట్లను వారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అదాని డేటా సెంటర్ విశాఖకు గొప్ప వరంగా మారనుందన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ ప్రాజెక్టు ఊతంలా నిలబడుతుందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం నిర్మాణంతో ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారిపోతుందన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎప్పటికి గుర్తుండిపోయే రెండు అతి పెద్ద ప్రాజెక్టులకు ఒకే రోజు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం గర్వ కారణం అని తెలిపారు. వారి వెంట ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కలెక్టర్ మల్లికార్జున్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు మాటలు కోటలు దాటుతుంటాయి

చంద్రబాబు మాటలు కోటలు దాటుతుంటాయని, ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం ఎప్పుడు చేస్తూ ఉంటారని మంత్రి విడదల రజని అన్నారు. కేవలం ఎన్నికలకు ముందు శంకుస్థాపన చేసి తామే సాధించాం అన్నట్లుగా ఆయన మాట్లాడటం విడ్డూరంగా ఉంటుందని తెలిపారు. అప్పట్లో ఆయన భూసేకరణ సరిగ్గా చేపట్టలేదని ఆరోపించారు. కోర్టులో కేసులు ఉన్నా పరిష్కారానికి ప్రయత్నించలేదని, పర్యావరణ అనుమతులు తెప్పించాలనే స్పృహ లేకుండా గత ప్రభుత్వం పనిచేసిందని మండిపడ్డారు.

ఏపీపీగా బి.వి.ఆర్.మూర్తి



విశాఖ లీగల్: ఎస్సీ, ఎస్టీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం కం 11వ అదనపు జిల్లా న్యాయస్థానం ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నగరానికి చెందిన బండారు వెంకట రమణమూర్తి(బి.వి.ఆర్ మూర్తి) నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మూర్తి ఈ పదవిలో మూడేళ్ల పాటు కొనసాగుతారు. 1986లో ఆంధ్రవిశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రంలో ఆయన పట్టా తీసుకుని.. న్యాయవాద వృత్తిని చేపట్టారు. ఎన్నో కీలకమైన కేసుల్లో తన ప్రతిభను నిరూపించారు.

పలు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు న్యాయ సలహాదారుడిగా పనిచేశారు. గతంలో ప్రభుత్వ న్యాయవాదిగా, న్యాయవాదుల సంఘం కార్యదర్శిగా సేవలందించారు. ఆయనకు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు, కార్యదర్శి పైలా శ్రీనివాసరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, సభ్యులు ఎస్.కృష్ణ మోహన్, బైపా అరుణ్ కుమార్, పి.నరసింగరావురావు, శిష్టాల శ్రీనివాసమూర్తి తదితరులు అభినందించారు.

సప్లిమెంటరీలో గట్టెక్కేలా..!

- ఇంటర్ తప్పిన విద్యార్థులకు స్పెషల్ క్లాసులు
- నిపుణులైన అధ్యాపకులతో బోధన

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో తప్పిన విద్యార్థులు అడ్వాన్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించేలా కాలేజీల్లో కార్యాచరణ ప్రకటించారు. ఇంటర్మీడియట్ కమిషనరేట్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆర్ఐవో పి.ఉమారాణి ఇప్పటికే ఉమ్మడి విశాఖ జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల కాలేజీల ప్రిన్సిపాళ్లకు దిశానిర్దేశం చేశారు. అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి ప్రారంభంకానున్నాయి. రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫస్టియర్, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ ఇయర్ పరీక్షలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖ (విశాఖ, అనకాపల్లి, అల్లూరి) జిల్లాల్లో 38 ప్రభుత్వ కాలేజీలు ఉండగా మొదటి సంవత్సరంలో 20.72, రెండో సంవత్సరంలో 32.60 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఎస్సీ, బీసీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలో నిర్వహిస్తున్న కాలేజీల్లో వచ్చిన ఫలితాలపై సమీక్ష చేసిన అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. సప్లిమెంటరీ పరీక్షల్లో నూరుశాతం ఫలితాలు వచ్చేలా పక్కా ప్రణాళిక అమలు చేయాలని ఆదేశించారు.

ప్రత్యేక తరగతులపై ఫోకస్

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కాలేజీల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. రోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తూ, సబ్జెక్టుల వారీగా బోధన జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఫెయిలైన విద్యార్థులంతా తప్పని సరిగా తరగతులకు హాజరయ్యేలా సబ్జెక్టు అధ్యాపకులకు బాధ్యతలు అప్పగించారు. వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి, విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ, విద్యార్థులంతా తరగతులకు హాజరయ్యేలా శ్రద్ధ తీసుకుంటున్నారు. కాలేజీల వారీగా స్పెషల్ క్లాసుల నిర్వహణ ఎలా సాగుతున్నాయనేది ఆర్ఐవో పి.ఉమారాణి పర్యవేక్షణ చేస్తున్నారు.

ఉపాధ్యాయుల డిప్యుటేషన్ కొనసాగింపు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో హైస్కూల్ ప్లస్‌గా 9 పాఠశాలలను అప్‌గ్రేడ్ చేశారు. వీటి ద్వారా 244 మంది పరీక్షలకు హాజరుకాగా, వారిలో కేవలం 11 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. దీనిపై దృష్టి సారించిన విద్యాశాఖాధికారులు, వీరికి కూడా స్పెషల్ క్లాసుల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. హైస్కూల్ ప్లస్‌కు డిప్యుటేషన్‌పై నియమించిన సబ్జెక్టు ఉపాధ్యాయులను సప్లిమెంటరీ పరీక్షలు ముగిసేంత వరకు అదే చోట పనిచేసేలా తాజాగా ఆదేశాలు జారీ చేశారు.

గడువు ముగిసినా గూడుపుఠాణి!

- నిబంధనలన్నీ స్వీప్
- జీవీఎంసీ మెకానికల్ టెండర్లలో అవినీతి బాగోతం
- స్వీపింగ్, బాబ్‌క్యాట్ మిషన్ల టెండర్లలో కాలయాపన
- గడువు ముగిసి రెండు వారాలైనా తెరవని వైనం



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో టెండర్ల గడువు ముగిసినప్పటికీ తెరవకుండా గూడుపుఠాణి నడుస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లకుగానూ 11 స్వీపింగ్ మిషన్లు, 20 బాబ్‌క్యాట్ మిషన్ల కోసం ఏప్రిల్ 4వ తేదీన మెకానికల్ విభాగం టెండర్లను ఆహ్వానించింది. గడువు ఏప్రిల్ 20వ తేదీతోనే ముగిసింది. అయినప్పటికీ తెరవకుండా కాలయాపన చేస్తుండటం... ఇందుకు అనుగుణంగా టెండర్‌లో పాల్గొన్న సంస్థ అనుభవంపై అనుమానాలను వ్యక్తం చేస్తూ ఆ సంస్థతో జట్టుకట్టిన జాయింట్ వెంచర్ సంస్థకు జీవీఎంసీ అధికారి పేరుతో ఫేక్ కాల్ వెళ్లడం ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. టెండర్‌లో పాల్గొన్న సదరు సంస్థను తప్పించేందుకు మరో కాంట్రాక్టు సంస్థ ఈ పనికి దిగిందా? నిజంగా జీవీఎంసీ అధికారుల ప్రమేయం ఉందా అన్న విషయం తేలాల్సి ఉంది. దీనిపై సదరు సంస్థ అధికారికంగా జీవీఎంసీకి లేఖ కూడా రాసింది. జీవీఎంసీ అధికారి మాట్లాడతారంటూ తమ సంస్థకు కాల్ వచ్చిందని.... దీనిపై విచారణ చేసి తమకు వాస్తవాలను నివేదించాలని కోరింది. అయితే, జీవీఎంసీ మెకానికల్ విభాగం నుంచి ఈ లేఖపై ఇంకా స్పందించలేదని తెలుస్తోంది. వాస్తవానికి టెండర్ గడువు ముగిసిన తర్వాత తెరవకుండా ఎందుకు కాలయాపన చేశారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

అధికారి పేరుతో ఫేక్ కాల్స్...!

వాస్తవానికి జీవీఎంసీ పరిధిలో మెకానికల్ విభాగంపై మొదటి నుంచీ విమర్శలు వస్తూనే ఉన్నాయి. టెండర్ల ఖరారు నుంచి పనుల కేటాయింపు వరకూ అధికారుల వ్యవహారంపై ఆరోపణలు వెల్లువెత్తడం పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలోనే తాజాగా జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లల్లో 11 స్వీపింగ్ మిషన్లు, 20 బాబ్‌క్యాట్ యంత్రాల కోసం పిలిచిన టెండర్ల కాలపరిమితి ఏప్రిల్ 20వ తేదీతో ముగిసింది. ఈ టెండర్లలో జాయింట్ వెంచర్ (జేవీ) సంస్థలు కూడా టెండర్‌లో పాల్గొనవచ్చననే నిబంధన ఉంది. దీంతో ఒక కాంట్రాక్టు సంస్థ హైదరాబాద్‌కు చెందిన మరో సంస్థతో కలిసి జేవీగా టెండర్‌లో పాల్గొన్నట్టు తెలుస్తోంది. అయితే, ఆ కాంట్రాక్టు సంస్థకు అనుభవం లేనందువల్ల జట్టుకట్ట వద్దని.. ఏకంగా జీవీఎంసీ అధికారి పేరుతో ఫోన్ వెళ్లడం గమనార్హం. ఈ విషయమై సదరు హైదరాబాద్‌కు చెందిన సంస్థ జీవీఎంసీకి అధికారికంగా ఫిర్యాదు చేసింది. జీవీఎంసీ అధికారుల పేరుతో తమకు కాల్స్ వచ్చాయని... దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్టు సమాచారం. అయితే, దీనిపై అధికారులు ఇంకా మౌనంగానే ఉండటం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా టెండరు గడువు ముగిసిన తర్వాత వెంటనే టెండర్ వాల్యుయేషన్ ప్రక్రియ చేపట్టడం ఆనవాయితీ. అయితే ఇందుకు భిన్నంగా వ్యవహారం నడుస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో దీనిపై జీవీఎంసీ ఉన్నతాధికారులు ఏ చర్యలు తీసుకుంటారో చూడాల్సి ఉంది.

ఇక స్క్రాప్ ఫ్రీ సిటీ!

- కణమాంలో రాజన్న ఆటోనగర్
- 157.77 ఎకరాల్లో ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- నగరంలోని 1,300 స్క్రాప్ యూనిట్ల తరలింపు
- ఆటోస్పేర్ పార్టులు, స్క్రాప్, ఇతర యూనిట్ల స్థాపనకు అవకాశం
- 2,500 కుటుంబాలకు ప్రయోజనం

సాక్షి, విశాఖపట్నం: స్మార్ట్ సిటీగా విరాజిల్లుతున్న విశాఖ నగరం త్వరలో స్క్రాప్ ఫ్రీ సిటీగా మారబోతోంది. ఇందుకు అవసరమైన ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. కాలుష్య తీవ్రతను తగ్గించే చర్యల్లో భాగంగా నగరంలోని స్క్రాప్ దుకాణాల (ఇనుప తుక్కు)ను నగర శివారు ప్రాంతాలకు తరలించాలన్న ప్రతిపాదన ఎన్నేళ్లగానో ఉంది. ఇందుకోసం ఒక ఎక్స్‌క్లూజివ్ ఆటోనగర్‌ను ఏర్పాటు చేయాలని సంబంధిత దుకాణ యజమానులు దాదాపు పదేళ్ల నుంచి కోరుతున్నారు. తొలుత గుర్రంపాలెం, కోడూరు తదితర ఇండస్ట్రియల్ పార్కుల్లో ప్లాట్లు కేటాయిస్తామని, అక్కడకు తరలి వెళ్లాలని గత ప్రభుత్వ హయాంలో సూచించారు. అందుకు వీరు ససేమిరా అన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక 2020లో ఆనందపురం మండలం కణమాం సమీపంలో 157.77 ఎకరాల ప్రభుత్వ భూమిలో రాజన్న ఆటోనగర్ పేరిట దీనిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. అయితే అప్పట్లో కోవిడ్ ప్రభావం వల్ల ఆలస్యమైంది. ప్రతిపాదిత ఆటోనగర్ ప్రాంతంలోని ప్రభుత్వ భూమిలో సాగుదారులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది. ఈ సొమ్ములో ప్రభుత్వం ఇప్పటికే రూ.20 కోట్లు బ్యాంకులో డిపాజిట్ చేసింది. ప్రభుత్వం నుంచి మరో రూ.14 కోట్లు రావలసి ఉందని ఏపీఐఐసీ ఇన్‌చార్జి జోనల్ మేనేజర్ త్రినాథ్ 'సాక్షి'కి చెప్పారు.

ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

తాజాగా కణమాం రాజన్న ఆటోనగర్‌కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. త్వరలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ఆటోనగర్‌కు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఆటోనగర్‌లో 250, 500, 1000 గజాల చొప్పున ఏపీఐఐసీ ప్లాట్లను కేటాయించాల్సి ఉంది. వీటిలో కొత్త వారికి కూడా ప్లాట్లను మంజూరు చేస్తారు. నగర పరిధిలోని తగరపువలస నుంచి గాజువాక వరకు జాతీయ రహదారికి ఆనుకుని అనేక స్క్రాప్ దుకాణాలున్నాయి. ఇవికాకుండా పెందుర్తి, ఎండాడ, ఇసుకతోట, టౌన్ కొత్తరోడ్డు, కోటవీధి, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోనూ ఇవి నడుస్తున్నాయి. రాజన్న ఆటోనగర్ అందుబాటులోకి వస్తే నగర పరిధిలో 1300కు పైగా ఉన్న స్క్రాప్ దుకాణాలన్నీ అక్కడకు షిఫ్ట్ అవుతాయి. కణమాం ఆనందపురానికి 12 కిలోమీటర్ల దూరంలో, జాతీయ రహదారికి చేరువలో ఉంది. అందువల్ల ఈ ప్రాంతం ఇటు విశాఖ, అటు విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నుంచి స్క్రాప్‌ను తరలించేందుకు అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. దీంతో ఇప్పటికే ఆయా దుకాణాల యజమానులు తమ దుకాణాలను అక్కడకు మార్చుకోవడానికి అంగీకరించారు. ఈ ఆటోనగర్ నిర్మాణం జరిగితే 2,500 కుటుంబాలకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది.


కణమాంలో ప్రతిపాదిత రాజన్న ఆటోనగర్

జగనన్నకు రుణపడి ఉంటాం..



స్మార్ట్ సిటీలో భాగంగా నగరంలో కాలుష్యాన్ని నివారించాలన్న ఉద్దేశంతో మా స్క్రాప్ దుకాణాలను ఇతర ప్రాంతాలకు తరలించాలని అధికారులు కోరుతున్నారు. మాకు అనువైన ప్రాంతంలో ప్రత్యేకంగా ఆటోనగర్‌ను ఏర్పాటు చేసి అక్కడ ప్లాట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశాం. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మా అభ్యర్థనను మన్నించి మాకు ఆమోదయోగ్యమైన కణమాంలో ఆటోనగర్ ఏర్పాటుకు క్లియరెన్స్ ఇచ్చారు. మరో ఆరు నెలల్లో అక్కడ ప్లాట్లు వేసే అవకాశం ఉంది. అనంతరం మా స్క్రాప్ దుకాణాలను అక్కడకు తరలిస్తాం. జగనన్నకు మేమంతా జీవితాంతం రుణపడి ఉంటాం.

– పటాన్ ఖాజావలి, అధ్యక్షుడు, ఆటోనగర్ యూనియన్

ఉత్తమ జర్నలిస్టుగా గోపీకిశోర్ రాజా


వెంకయ్య నాయుడు నుంచి అవార్డు స్వీకరిస్తున్న సాక్షి స్టాఫ్ రిపోర్టర్ గోపీకిశోర్ రాజా

దొండపర్తి(విశాఖ దక్షిణ): సాక్షి స్టాఫ్ రిపోర్టర్ కరుకోల గోపీకిశోర్ రాజాకు ఉత్తమ జర్నలిస్టు అవార్డు లభించింది. తెలుగు జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో గుంటూరులో జరిగిన ఉగాది అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. సామాజిక చైతన్యం విభాగంలో గోపీకిశోర్‌రాజా అవార్డుకు ఎంపికయ్యారు.

నాలుగు కరోనా కేసుల నమోదు

మహారాణిపేట: జిల్లాలో మంగళవారం మరో నలుగురు కరోనా బారిన పడ్డారు. గడిచిన 24 గంటల్లో 176 మందికి పరీక్షలు నిర్వహించగా.. నలుగురికి కరోనా నిర్ధారణ అయింది. దీంతో జిల్లాలో కరోనా సోకిన వారి సంఖ్య 25కి చేరింది. 23 మంది హోం ఐసోలేషన్‌లో, ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పి.జగదీశ్వరరావు తెలిపారు.

రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ రాక నేడు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు బుధవారం విశాఖ వస్తున్నారు. రాత్రి 8 గంటలకు ప్రభుత్వ సర్క్యూట్ హౌస్‌కు చేరుకుని, రాత్రికి అక్కడే బస చేస్తారు. 4న 10 గంటలకు జర్నలిస్టులతో, 11.30 గంటలకు అధికారులతో సమావేశమవుతారు. రాత్రి 7గంటలకు విజయవాడ బయలుదేరుతారు.

బీఈడీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బీఈడీ ఎంట్రన్స్‌కు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆ వర్సిటీ అభ్యసన సహాయ సేవా విభాగం డైరెక్టర్ డాక్టర్ ఎల్.విజయకృష్ణారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. బీఈడీలో 2022 – 23 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి పరీక్షను జూన్ 6న నిర్వహించనున్నారు. ఇందుకోసం ఈ నెల 16లోగా www.braouonline.inలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అపరాధ రుసుంతో మే 22 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

డీఏ పెంపుపై సచివాలయ ఉద్యోగుల హర్షం

అల్లిపురం (విశాఖ దక్షిణ): ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు జనవరి 1, 2022 నుంచి ఇవ్వాల్సిన డీఏను విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో గ్రామ,వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ తరఫున రాష్ట్ర అధ్యక్షుడు జానీ పాషా, స్టేట్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ పీవీ కిరణ్‌కుమార్ యాదవ్, విశాఖపట్నం ప్రెసిడెంట్ పీజే గణేష్‌కుమార్‌లు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 1.34 లక్షల మంది యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించినందుకు సచివాలయ ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలి

ఎంవీపీకాలనీ: పరీక్షల్లో విఫలమైన విద్యార్థుల్లో ఆయా కళాశాలల యాజమాన్యాలు మనోధైర్యం నింపాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ కోరింది. ఇంటర్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించని కారణంగా విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడంపై కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాం ఆందోళన వ్యక్తం చేశారు. ఎంవీపీ కాలనీలోని మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. పరీక్షల్లో విఫలమైతే విద్యార్థులు జీవితాన్ని వదులుకోవాల్సిన అవసరం లేదన్నారు. విద్యార్థులు భవిష్యత్‌కు మార్కులు, మెరుగైన ర్యాంకులే శరణ్యం కాదన్నారు. ఈ దిశగా విద్యార్థులను ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు, తల్లిదండ్రులు చైతన్య పరచాలని సూచించారు. మీడియాలో విద్యార్థుల ఆత్మహత్యలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా వారిపై ఒత్తిడి పెంచుతుందన్నారు. ర్యాంకుల పేరుతో విద్యార్థులు ఫొటోలు ప్రచురించడం, ఒత్తిడి చేయడం వంటివి మానుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కేసలి అప్పారావు, సీతారాం

సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడి

- ఏయూ వీసీ ప్రసాద రెడ్డి

ఏయూక్యాంపస్: సృజనాత్మక ఆలోచనలే పెట్టుబడిగా యువతరం అంకుర సంస్థలను స్థాపించాలని, దీనికి అవసరమైన పెట్టుబడి, మౌలిక వసతులు వర్సిటీ పరంగా అందిస్తామని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థుల ఉద్యోగ విజయోత్సవంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వృత్తిపరమైన సవాళ్లను అధిగమించడానికి, నిర్ధారిత లక్ష్యాలను ఛేదించడానికి మానసికంగా సిద్ధం కావాలన్నారు. ప్రతీ కష్టం వెనుక అవకాశాలు ఉంటాయనే వాస్తవాన్ని గుర్తించాలన్నారు. దేశానికి నూతన గతి శక్తిగా యువతరం నిలుస్తారన్నారు. విశ్వవిద్యాలయం కేవలం ఆర్ట్స్ కోర్సులతోనే ప్రారంభం అయిందనే విషయం గుర్తుంచుకోవాలన్నారు. మానవ సంబంధాలకు ఆర్ట్స్ కోర్సుల అభ్యసనం ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. నిత్యం తల్లిదండ్రులతో మాట్లాడాలని సూచించారు. రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ తల్లిదండ్రుల విలువ తెలుసుకుని మసలుకోవాలన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ దేశానికి ఇన్నోవేషన్ ఎంతో అవసరమన్నారు. దీనికి అవసరమైన మౌలిక వసతులను వర్సిటీ కల్పిస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, ఐఏఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, ప్లేస్‌మెంట్ అధికారి వి.ఆర్ రెడ్డి, విభాగాధిపతులు, ఆచార్యులు పాల్గొన్నారు. అనంతరం 202 మంది విద్యార్థులకు 350కిపైగా ఉద్యోగ నియామక పత్రాలను వీసీ ప్రసాద రెడ్డి అందజేశారు. వేదికపై తల్లిదండ్రులను సత్కరించి, వారి పాదాలకు నమస్కరించిన అనంతరం విద్యార్థులు నియామక పత్రాలను స్వీకరించారు.


విద్యార్థులకు పత్రాలు అందిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ప్లేస్‌మెంట్ టీం బాగా పనిచేసింది



ప్లేస్‌మెంట్స్‌ని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేకంగా ఒక టీంని ఏర్పాటు చేశారు. వీరు ఎంతో సమర్థవంతంగా, సమన్వయంతో పనిచేశారు. క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో ఫెడరల్ బ్యాంక్‌కు రూ 13.5 లక్షల వేతనంతో ఎంపిక అయ్యాను. మంచి వేతనాలతో ఎక్కువ మంది ఎంపిక కావడం ఆనందాన్ని ఇచ్చింది.

–మురళీకృష్ణ, ఎంబీఏ విద్యార్థి

యూనివర్సిటీ ప్రగతి బాగుంది




మాది ప్రకాశం జిల్లా చీరాల. మా అబ్బాయిని ఎంబీఏలో ఎక్కడ చేర్పించాలనే అన్వేషణలో ఏయూ ప్రగతి బాగుందని తెలిసింది. ఇక్కడ చేర్పించాను. మా అబ్బాయి ఫెడరల్ బ్యాంక్‌లో ఉద్యోగానికి ఎంపిక కావడం ఆనందాన్ని ఇచ్చింది. ఏయూపై మేము పెట్టుకున్న నమ్మకం మరింత పెరిగింది.

–రాంబాబు, చీరాల

స్కై షో


సాయంత్రం 5.30 గంటలకు కమ్ముకున్న మేఘాలు


సాయంత్రం 5.40 గంటల సమయంలో నీలి ఆకాశం


సాయంత్రం 5.59 గంటలకు చంద్రుడు

అందమైన లోకంలో అద్భుతాలు ఎన్నెన్నో..హృదయానికి కనులుంటే గగనమంతా ఆనందమే..నీలి మబ్బుల్లో ఆకాశం అద్భుత కావ్యం..మబ్బులు వీడే సమయంలో నీలివర్ణం అమోఘం..నీలి ఆకాశంలో దాగుడుమూతలాడే చందమామ చేసెను కనువిందు.

- ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్

పోలీసులు అదుపులో జన జాగరణ సమితి నాయకులు


మధురవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశాఖ పర్యటన నేపథ్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా మధురవాడ ఐటీ హిల్స్‌లో బ్యానర్లు కట్టిన జన జాగరణ సమితి నాయకులను పీఎంపాలెం పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. మధురవాడ సమీపంలోని ఐటీ హిల్-4లో అదానీ డేటా బేస్ సెంటర్ శంకుస్థాపన కార్యక్రమానికి సీఎం, ఇతర ప్రముఖులు బుధవారం వస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో మంగళవారం వేకువ జామునే జన జాగరణ సమితి ఆధ్వర్యంలో 'రాజధాని లేని రాష్ట్ర ముఖ్యమంత్రికి స్వాగతం-సుస్వాగతం అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. దీంతో ఈ సంస్థ విశాఖ సిటీ కో కన్వీనర్ కె.దామోదర గుప్త, రాష్ట్ర కన్వీనర్ కె.వాసులను పీఎం పాలెం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి మాక్ టెస్ట్‌కు అనూహ్య స్పందన

ఆనందపురం : మండలంలోని శొంఠ్యాంలోని ఎస్ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో సాక్షి ఆధ్వర్యంలో మూడు రోజులు పాటు నిర్వహించనున్న మాక్ ఆన్‌లైన్ టెస్ట్‌కు మొదటి రోజు మంగళవారం అనూహ్య స్పందన లభించింది. దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలకు నిర్వహించే నీట్, తెలుగు రాష్ట్రాల్లో ఇంజినీరింగ్/అగ్రికల్చర్ తదితర కోర్సులలో ప్రవేశాలు కల్పించేందుకు ఎంసెట్‌కు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఆన్‌లైన్ మాక్ టెస్ట్ నిర్వహించారు. శ్రీ చైతన్య కళాశాలతో పాటు పలు కళాశాల విద్యార్థులు ఈ మాక్ టెస్ట్‌లో పాల్గొని తమ ప్రతిభను పరీక్షించుకున్నారు. ఉదయం 10 గంటలు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ టెస్ట్‌ను నిర్వహించారు. మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షలకు సంబంధించి 160 ప్రశ్నలకు మూడు గంటలు పాటు పరీక్ష నిర్వహించారు. బుధ, గురువారాల్లో కూడా విద్యార్థులకు మాక్ టెస్ట్ నిర్వహించనున్నారు. కళాశాల కార్యదర్శి ప్రసాదరాజు, డైరెక్టర్ మురుగదాసు సహకారం అందించగా శ్రీచైతన్య విద్యా సంస్థల ఏజీఎం కేవీ రమణ, డీన్ ఎస్.రఘు కుమార్, ఏవో పి.సురేష్ కుమార్ పర్యవేక్షించారు.


సాక్షి మాక్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

సమయపాలన తెలిసింది



సాక్షి మాక్ టెస్ట్ వలన సమయ పాలన తెలిసింది. ఇచ్చిన సమయంలోనే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఎలా రాయాలో నేర్చుకున్నా. సమయపాలన తెలుసుకుంటే స్థిమితంగా సమాధానాలు రాయవచ్చు. ఒక్కొక్క ప్రశ్నకు ఎంతెంత సమయం కేటాయించవచ్చో అవగాహన వచ్చింది.

– అల్లు మనోహర్ నాయుడు, ఎంపీసీ, శ్రీ చైతన్య కళాశాల, బోయిపాలెం

సబ్జెక్టులు వారీగా ప్రశ్నలు తెలిశాయి



వివిధ ప్రవేశ పరీక్షలలో సబ్జెక్టులు వారీగా ప్రశ్నలు ఎలా వస్తాయో తెలుసుకోగలిగాను. దానికి అనుగుణంగా అసలు పరీక్షలకు సన్నద్ధమవుతున్నాను.

– లోగిశ లక్ష్మణరావు, ఎంపీసీ, శ్రీచైతన్య కళాశాల, బోయిపాలెం

పేపర్ మోడల్‌పై అవగాహన



సాక్షి మాక్ టెస్ట్‌కు హాజరు కావడం వలన ప్రవేశ పరీక్ష మోడల్ పేపర్ తెలిసింది. దీంతో అసలు ప్రవేశ పరీక్ష రాసేటప్పుడు గందరగోళానికి గురి కాకుండా చక్కగా రాయడానికి అవకాశం కలుగుతుంది.

–సాయి సాత్విక, ఎంపీసీ, శ్రీచైతన్య కళాశాల, బోయిపాలెం

భయం పోయింది



మాక్ టెస్ట్ ద్వారా పూర్తి అవగాహన వచ్చింది. ఇది అసలు పరీక్ష రాసేటప్పుడు ఉపయోగపడుతుంది. భయం లేకుండా పరీక్ష రాయడానికి అవకాశం కలిగింది.

– ఒడిసి సోనిత, ఎంపీసీ, శ్రీచైతన్య కళాశాల, బోయిపాలెం